
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

ఆదివారం 6 జూలై 2025

విద్యుదుత్పత్తిలో జెన్కో రికార్డ్

కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి 6

బంగారు బాపట్ల

పీ-4 అమలులో రాష్ట్రంలోనే అగ్రభాగం

- కలెక్టర్ వెంకట మురళికి సీఎం ప్రత్యేక అభినందనలు
- మార్గదర్శకుల ఎంపికలో పక్కా ప్రణాళిక
- 72 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం
- గుంటూరు, పల్నాడులో ముమ్మర కసరత్తు

సీఎం చంద్రబాబు నాయుడు మదిలో పుట్టిన మహత్తర ఆలోచన పీ-4. బంగారు కుటుంబాల ఎంపికతో పేదరిక నిర్మూలనకు ఆయన యుద్ధమే చేస్తున్నారు. సీఎం ఆలోచనలకు కలెక్టర్ పట్టుదల తోడవడంతో రాష్ట్రంలోనే బాపట్ల జిల్లా ఈ పథకం అమలులో అగ్రభాగాన నిలిచింది. ఇప్పటికే 72 శాతం బంగారు కుటుంబాలను మార్గదర్శకులతో అనుసంధానం పూర్తి చేసి.. పక్కా ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ముందుకెళ్తోంది. ఇందుకు గాను కలెక్టర్ జె.వెంకట మురళి సీఎం ప్రశంసలు కూడా అందుకున్నారు.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

ఈ ఏడాది ఏప్రిల్ 1న బాపట్ల జిల్లాలోని చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్ల పాలెంలో పింఛన్ల పంపిణీకి స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు విచ్చేశారు. అక్కడే వేదికపై ఇద్దరు మార్గదర్శకులను పరిచయం చేసి, గ్రామంలో కడు పేదరికంలో ఉన్న 33 బంగారు కుటుంబాలను వారికి అనుసంధానం చేశారు. అప్పటి నుంచి జిల్లా వ్యాప్తంగా ఓ వైపు బంగారు కుటుం బాల సర్వే చేపడుతూనే.. మార్గదర్శకుల ఎంపిక పై జిల్లా యంత్రాంగం పక్కా ప్రణాళికతో అడుగులేసింది. రెండు వారాల కోసారి సమీక్షలు జరిపి.. పురోగతిని బేరీజు వేసుకుని ముందు కెళ్తున్నారు. దాని ఫలితమే నేడు పీ-4 అమలులో రాష్ట్రంలోనే జిల్లా అగ్రభాగాన నిలిచింది.



పీ4 అమలు సమీక్షలో కలెక్టర్ వెంకటమురళి

3,528 మంది మార్గదర్శకులు

బంగారు కుటుంబాల సర్వే బాపట్ల జిల్లాతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా ఓ కొలిక్కి వచ్చింది. కానీ, మార్గదర్శకుల ఎంపికే యంత్రాంగానికి సవాల్‌గా మారింది. బాపట్ల జిల్లా యంత్రాంగం ప్రణాళికాబద్ధంగా అడుగు లేసి 3,528 మార్గదర్శకులను పీ-4లో భాగంగా ఎంపిక చేసింది. వారి సామర్థ్యాన్ని బట్టి.. ఒకటి నుంచి పది బంగారు కుటుంబాలను అప్పగించడం జరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఎంపికైన మార్గదర్శకుల సంఖ్య వెయ్యిలోపే ఉన్నట్లు సమాచారం. శుక్రవారం సీఎం చంద్రబాబు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బాపట్ల జిల్లాలో అనుసరించిన నమూనా పాటించాలని మిగతా జిల్లాలకు సూచించారు.

అందరి సహకారంతో..

మార్గదర్శకుల ఎంపికలో కార్పొరేట్ దిగ్గజాలపైనే ఆధారపడకుండా సేవాభావంతో పాటు సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వాలనే దృక్పథం ఉన్న ప్రతి ఒక్కరినీ కలుపుకుని వెళ్లడంలో బాపట్ల జిల్లా యంత్రాంగం విజయవంతమైంది. గ్రామాల్లో ఉన్న ఎన్ఆర్ఐల సహకారం తీసుకుంది. ఎన్‌జీవో ఆర్గనైజేషన్స్, వివిధ విభాగాల జిల్లా అధికారులు, స్తోమతను బట్టి ఒక్క బంగారు కుటుంబానికే సాయం చేస్తామని ముందుకొచ్చిన వారిని కూడా ఈ పీ4లో భాగస్వాములుగా చేశారు. సమాంతరంగా జిల్లాలో ఉన్న ఓ మోస్తరు కంపెనీల అధినేతలతో కూడా కలెక్టర్ వెంకటమురళి పలు సార్లు సమావేశమయ్యారు. సీఎస్ఆర్ కింద వారిని కూడా ఈ బృహత్తర కార్యక్రమంలో పాలు పంచుకునేలా చేశారు. ఇలా అన్ని వైపుల నుంచి చిత్తశుద్ధితో ప్రయత్నాలు జరగడం వల్లే 3,528 మార్గదర్శకులను ఎంపిక చేయగలిగి సీఎం మన్ననలందుకోగలిగారు.

మూడు జిల్లాల్లో బంగారు కుటుంబాలు..

బాపట్ల జిల్లాలో మొత్తం 62,388 బంగారు కుటుంబాలను పీ4 కింద యంత్రాంగం ఎంపిక చేసింది. ఇందులో 44,920 కుటుంబాలను 3,528 మంది మార్గదర్శకులకు అనుసంధానం చేశారు. దీంతో 72 శాతం కుటుంబాలకు పీ4 అమలుకు మార్గం సుగమమైంది. పల్నాడు జిల్లాలో మొత్తం 79 వేల పేద కుటుంబాలను జిల్లా యంత్రాంగం ఎంపిక చేసింది. గుంటూరు జిల్లాలో దాదాపు 58 వేల కుటుంబాలు పీ-4కు అర్హత సాధించాయి. ఈ రెండు జిల్లాల్లో మార్గదర్శకుల సంఖ్య తక్కువగా ఉండడంతో అనుసంధానం నెమ్మదిగా జరుగుతోంది. 40 శాతం బంగారు కుటుంబాల అనుసంధానం ప్రక్రియ పూర్తయింది.

కీలకంగా డీఆర్డీఏ విభాగం

పీ4 అమలు కోసం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించి , క్రమం తప్పకుండా సమీక్షలు (మిగతా 6వ పేజీలో)

170 పాఠశాలలు జీరో అడ్మిషన్!

ఉపాధ్యాయులు, అధికారులు బదిలీల హడావుడిలో మునిగి పోయారు. ఈ ఏడాది పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం బడిబాట వంటి కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిర్వహించ లేదు. దీంతో సర్కారు బడుల్లో ప్రవేశాలు పూర్తిగా పడి పోయాయి. మరో వైపు తల్లికి వందనం పథకాన్ని కూడా ప్రైవేట్ స్కూళ్ల యజమాన్యాలు తమకు అనుకూలంగా మలుచు కున్నాయి. ఆ నగదునే ఫీజుగా చెల్లించి అడ్మిషన్లు పొందాలని సూచించడంతో.. తల్లిదండ్రులు అటువైపు మొగ్గారు. వందల సంఖ్యలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఒక్క విద్యార్థి కూడా ఈ ఏడాది చేరలేదంటే.. పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ప్రభుత్వ పాఠశాలల్లో పడిపోయిన ప్రవేశాలు

- బదిలీల హడావుడిలో
- ఉపాధ్యాయులు, విద్యాశాఖ
- 'బడిబాట' కూడా నిర్వహించని వైనం
- తల్లికి వందనం నగదే.. ప్రైవేట్ స్కూళ్ల ఫీజు
- పల్నాడు జిల్లాలో పరిస్థితి మరీ దారుణం
- వందల పాఠశాలల్లో అడుగుపెట్టని విద్యార్థులు



170 పాఠశాలల్లో ఒక్కరు కూడా చేరలేదు

పల్నాడు జిల్లాలోని అనేక ప్రభుత్వ పాఠశాలల్లో ఈ ఏడాది అడ్మిషన్లు భారీగా తగ్గిపోయాయి. దాదాపు 170 పాఠశాలల్లో ఇప్పటి వరకు ఒక్క విద్యార్థి కూడా చేరలేదు. దీనికి తోడు జిల్లాలోని అనేక పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా ఉంది. పల్నాడు నుంచి భారీ సంఖ్యలో ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లిపోయారు. కొత్త డీఎస్సీ ఫలితాలు వస్తేనే.. ఉపాధ్యాయుల భర్తీ జరుగుతుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు చెబుతున్నారు.

గుంటూరు, విద్య జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, మండల పరిషత్, ఎయిడెడ్ ఆధ్వర్యంలో దాదాపు 900 వరకు పాఠశాలలున్నాయి. ఆయా పాఠశాలల్లో దాదాపు 6.50 లక్షల మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. ఈ ఏడాది ఉపాధ్యాయులు బదిలీల హడావుడిలో.. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంగతి విస్మరించారు. దీనిని తమకు అను కూలంగా మార్చుకున్న ప్రైవేట్ యాజమాన్యాలు.. భారీ సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను తమ వైపునకు ఆకర్షించాయి. దీంతో సర్కారు పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం వెతుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ప్రభుత్వ కార్యక్రమాలు ఏవి?

ప్రభుత్వ (మిగతా 6వ పేజీలో)

లోక్ అదాలత్ రికార్డు

- ఉమ్మడి జిల్లాలో 10,734 కేసుల పరిష్కారం
- విలువ రూ.50.96 కోట్లు

గుంటూరు,(లీగల్) జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో శనివారం అన్ని కోర్టుల్లో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 10,734 కేసులు పరిష్కారమైనట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ తెలిపారు. వీటిలో సివిల్ కేసుల 1077, క్రిమినల్ కేసులు 9580, ప్రీ -లిటిగేషన్ కేసులు 77 ఉండగా ఈ పరిష్కారమైన కేసుల విలువ మొత్తం రూ. 50,96,79,914గా పేర్కొన్నారు. జిల్లా న్యాయశాఖ చరిత్రలో ఇప్పటి వరకు జరిగిన లోక్ అదాలత్‌లలో ఇంత పెద్ద మొత్తంలో కేసులు పరిష్కారం కావడం ఇదే మొదటిసారి అని హర్షం వ్యక్తం చేశారు. వాహన ప్రమాదాలకు సంబంధించిన మూడు పెద్ద కేసుల్లో బాధితులకు రూ.3.20 కోట్లు అందినట్టు తెలిపారు. ఈ లోక్ అదాలత్ విజయవంతానికి సహకరించిన కక్షిదారులు, పోలీస్, బ్యాంక్, ఇన్సూరెన్స్ కంపెనీల అధికారులు, న్యాయవాదులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.



బాధితులకు నగదు చెక్కు అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి కల్యాణ చక్రవర్తి

కలెక్టరేట్ రోడ్డులో ఆక్రమణల తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



నరసరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్ రోడ్డులోని మార్జిన్‌లోని అక్రమ నిర్మాణాలను మునిసిపాలిటీ అధికారులు శనివారం తొలగించారు. ఆక్రమించుకో.. అద్దెకిచ్చుకో శీర్షికతో ఆంధ్రజ్యోతిలో రహదారి ఆక్రమణలపై వెలువడిన కథనంపై ఆర్డీవో, మునిసిపల్ ప్రత్యేక అధికారి మధులత స్పందించారు. ఆర్డీవో ఆదేశాలతో మునిసిపల్ ప్రణాళికా విభాగం ఆక్రమణలు తొలగించింది. ఆక్రమణ దారులకు సోమవారానికి ఖాళీ చేయలని అధికారులు ఆదేశించారు.

చుక్కల భూముల సమస్యలు పరిష్కరించాలి

- ఆధారాలు చూపితే 22ఏ నుంచి తొలగించాలి
- కలెక్టర్ పి.అరుణ్‌బాబు

నరసరావుపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నిషేధిత జాబితాలో ఉన్న చుక్కల భూముల సమస్యలను త్వరిత గతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన భూ సమస్యల సమీక్ష సమావేశంలో అయన మాట్లాడారు. జిల్లాలో మూడు రెవెన్యూ డివిజన్ల పరిధిలో 22ఏ లిస్టులో పడిన భూ సమస్యలను వెంటనే పరిష్క రించాలన్నారు. సరైన ఆధారాలు చూపితే.. వాటిని పరిశీలిం చి ఆయా భూములను 22ఏ నుంచి తొలగించా లని ఆదేశించారు. సమావేశంలో జేసీ సూరజ్ ధనుంజ య్ గనోరే, డీఆర్‌వో మురళీ. ఆర్డీవోలు నరసరావుపేట మధులత, సత్తెనపల్లి రమణారెడ్డి, గురజాల మురళీకృష్ణ, తహసీల్దార్లు పాల్గొన్నారు.



సమావేశంలో కలెక్టర్ పి.అరుణ్ బాబు, జేసీ సూరజ్ ధనుంజయ్ గనోరే, డీఆర్వో మురళి



కార్యకర్తల గౌరవాన్ని పెంచుతా

- ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

పిడుగురాళ్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గురజాల నియోజకవర్గం అంటే టీడీపీలో ఓ గుర్తింపు ఉందని, 2013 సెప్టెంబరు 1న ఆత్మగౌరవ యాత్ర చంద్రబాబునాయుడుతో మొదలుపెట్టించి మేమున్నామనే ధైర్యాన్ని కల్పించిన గురజాల నియోజకవర్గ ప్రతి కార్యకర్తను గుర్తుంచుకుంటానని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యకర్తల గౌరవాన్ని పెంచే విధంగా చూస్తానని ఆయన భరోసా ఇచ్చారు. శనివారం స్థానిక మార్కెట్ యార్డులో పిడుగురాళ్ల, మాచవరం, దాచేపల్లి మండలాలకు చెందిన క్లస్టర్, యూనిట్, బూత్ కన్వీనర్ల సమావేశం జరిగింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు, అబద్ధాలను పదే పదే ప్రచారం చేయడం వల్ల 2019 ఎన్నికలలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని తెలియజేసేందుకు సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమం ద్వారా వివరించాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని యరపతినేని తెలిపారు. దేశంలోనే మహోన్నతమైన పథకంగా తల్లికి వందనంకు గుర్తింపు వచ్చిందన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. గురజాల అభివృద్ధిపై నియోజకవర్గ స్థాయి సమీక్ష జరిపామని, రాబోయే వారంలో మండల స్థాయిలో అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యల పరిష్కారానికి అక్కడికక్కడే కృషి చేయనున్నామని ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. ప్రతి గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని అభివృద్ధి ప్రణాళికతో ఎంత నిధులు అవసరమో నివేదిక తయారు చేయాలని అధికారులకు సూచించినట్లు యరపతినేని గుర్తుచేశారు. సుపరిపాలన తొలిఅడుగు ఇంటింటికి కార్యక్రమం కూడా సభ్యత్వ నమోదు మాదిరిగా గురజాల పేరు రాష్ట్రంలో మొదటి ఐదు స్థానాలలో ఉండేలా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. యువ నాయకులు నిఖిల్ మాట్లాడుతూ కష్టపడిన కార్యకర్తలను టీడీపీతో పాటు గురజాలలో యరపతినేని అండగా ఉండి పదవుల కేటాయింపులో ప్రాధాన్యత కల్పిస్తారన్నారు. నియోజకవర్గ పరిశీలకులు కళ్లం రాజశేఖర్‌రెడ్డి, లీలావతి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వేముల వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భూ ధారాదత్తంపై యరపతినేని లేఖాస్త్రం



- తుమ్మల చెరువు టోల్ ప్లాజా

- రూ.2 కోట్ల విలువైన భూమి కారుచౌకగా ధారాదత్తం
- నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకు కేటాయిస్తూ గత ప్రభుత్వం జీఓ
- వైసీపీ ఎంపీ అడిగారని జడ్పీకి తెలియకుండానే బదలాయింపు
- జీఓ రద్దు చేయాలని ఎమ్మెల్యే యరపతినేని ప్రభుత్వానికి లేఖ





గుంటూరు సిటీ, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో వైసీపీ నేతల భూ ఆక్రమణలు ప్రస్తుతం వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా వైసీపీ ఎంపీ అయోధ్యరామిరెడ్డి చొరవతో రూ.2 కోట్ల విలువైన జడ్పీ స్థలాన్ని నామ్ (నార్కెట్ పల్లి - అద్దంకి - మేదరమెట్ల) ఎక్స్ ప్రెస్‌వేకు కట్టబెడుతూ ఇచ్చిన జీవోను రద్దు చేయాలని గురుజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాసినట్లు వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది. అసలు విషయంలోకి వెళితే.. పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువు చెట్టు సమీపంలో నామ్ ఎక్స్‌ప్రెస్‌వేకి చెందిన టోల్ ప్లాజా ఉంది. ఇక్కడ సర్వే నంబరు 251లో జిల్లా పరిషత్‌కు చెందిన భూమిలో టోల్ ప్లాజాకు చెందిన షెడ్లు ఏర్పాటు చేశారు. మొత్తం 2.71 ఎకరాల భూమికి 2013 నుంచి అద్దె చెల్లిస్తూ వచ్చారు. 2018 తరవాత అద్దె చెల్లింపులు ఒక్కసారిగా నిలిపివేశారు. జడ్పీ అధికారులు ఎన్ని లేఖలు రాసినా నామ్ ఎక్స్‌ప్రెస్ వే యాజమాన్యం స్పందించలేదు. సు మారు రూ.12.64 లక్షల అద్దె బకాయి ఉన్నట్లు చెబుతున్నారు.

అధికారం అడ్డం పెట్టుకొని...

వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నామ్ ఎక్స్‌ప్రెస్ వే సంస్థ ఆలోచనా విధానం పూర్తిగా మారిపోయింది. బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లు పైనే ఉన్న జడ్పీ భూమిని కారుచౌక ధరకు తీసుకునేందుకు ప్రయత్నాలు ఆరంభం అయ్యాయి. హక్కుదారుగా జడ్పీని పూర్తిగా పక్కన పెట్టేసి ఆర్అండ్‌బీ శాఖను లైన్‌లోకి తెచ్చారు. 2023 మార్కెట్ విలువ ప్రకారం ఎకరాకు రూ.9.50 లక్షలు చెల్లించే విధంగా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. దీంతో వైసీపీ ప్రభుత్వం జడ్పీ భూమిని నామ్ వే ఎక్స్‌ప్రెస్‌కు కేటాయిస్తూ జీవో నంబరు 76 ను 2023 ఫిబ్రవరి 21న జారీ చేసింది.

నిబంధనలకు నీళ్లు

ఏదైనా ప్రభుత్వ భూమిని ప్రయివేట్ వ్యక్తులకు బదలాయించాలంటే.. హక్కుదారుగా ఉన్న ప్రభుత్వ శాఖ అనుమతి తీసుకోవాలి. ఒక వేళ భూమి విలువ రూ.2 లక్షలు పైన ఉంటే రాష్ట్ర మంత్రి మండలిలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని జీఓ నంబరు 323 చెబుతోంది. తుమ్మల చెరువు భూమి వ్యవహారంలో అటువంటిది ఏమీ జరగలేదు. అయోధ్య రామిరెడ్డి అడిగారు.. రాసి ఇచ్చేశారు అన్నట్లుగా తంతు జరిగిపోయింది.

2024 లో వెలుగులోకి..

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత తుమ్మల చెరువు భూమిపై చర్చ జరిగింది. గత సెప్టెంబరులో జరిగిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశంలో పిడుగురాళ్ల జడ్పీటీసీ సభ్యుడు జంగా కోటయ్య ఈ విషయం లేవనెత్తారు. అంతకు ముందు జడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా ఎంపీ అయోధ్య రామిరెడ్డి చేసిన అడ్డగోలు భూ దందాను గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలుస్తోంది. జడ్పీ అనుమతి లేకుండా నే జారీ అయిన జీవోను రద్దు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ప్రభుత్వానికి లేఖ రాయడం హాట్ టాపిక్ గా మారింది.

యరపతినేని లేఖ

తుమ్మల చెరువు భూమి వ్యవహారంపై గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సీరియస్‌గా దృష్టి సారించారు. జడ్పీ స్థలాన్ని బదలాయిస్తూ..తీసుకొచ్చిన జీవో నంబరు 76 రద్దు కోసం ఆయన ప్రభుత్వానికి లేఖ రాసినట్లుగా విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. ఇటు జడ్పీ పాలక వర్గం కూడా ఈ విషయంలో సీరియస్‌గా ఉంది. శుక్రవారం జరిగిన సమావేశంలో కూడా ఈ విషయాన్ని అజెండాలో చేర్చారు.

విద్యుదుత్పత్తిలో జెన్కో రికార్డ్



విద్యుత్ ప్రాజెక్టు మెయిన్ డ్యాంను పరిశీలిస్తున్న హైడల్ సీఈ రవీంద్రారెడ్డి

రెంటచింతల,జూలై 5 (ఆంధ్రజ్యోతి): బహిరంగ మార్కెట్లో విద్యుత్ కొనుగోలుకు వెళ్లకుండానే డిమాండ్ తగ్గట్లుగా ఏపీ జెన్కో విద్యుత్ ఉత్పత్తి చేస్తోందని విద్యుత్ సౌధ హైడల్ (సివిల్) సీఈ రవీంద్రారెడ్డి అన్నారు. సీఈగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా సత్రశాలలోని నాగార్జున సాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టును శనివారం సందర్శించి, ప్రాజెక్టులోని పలు విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ.. ఈ ఏడాది మార్చి 31 నాటికి 78 ఎం.యుల విద్యుత్ తయారు చేయాల్సి ఉండగా డిసెంబర్ నాటికే టార్గెట్ అధిగమించి 92.4279 ఎంయూల కరెంట్‌ను తయారు చేసి రికార్డు సృష్టించారని కొనియాడారు. ఎగువన ఉన్న రిజర్వాయర్లలో జలకళ కనిపిస్తోందన్నారు. అందుకనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని ఇంజనీర్లకు సూచించారు. 20 రేడియల్ క్రస్ట్ గేట్లను, పవర్ హౌస్ రెండు యూనిట్లను పరిశీలించారు. రూ.100 కోట్లతో చేపట్టబోయే సోలార్ పవర్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించి త్వరలో పనులు ప్రారంభించే అవకాశం ఉందని సూచన ప్రాయంగా పేర్కొన్నారు. ఈయన వెంట విద్యుత్ సౌధ ఈఈ కృష్ణారెడ్డి, ప్రాజెక్టు ఎస్ఈ వెంకటరమణ, జీఎం శ్రీనివాస్ తదితరులున్నారు.

నల్లపాటికి ఘన నివాళి





నల్లపాటి భౌతిక కాయన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యే యరపతినేని

నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): జీడీసీసీబీ మాజీ చైర్మన్ నల్లపాటి శివరామచంద్ర శేఖరరావుకు శనివారం నరసరావుపేట మండలం జొన్నలగడ్డలో అంత్యక్రియలు నిర్వహించారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు యరపతినేని శ్రీనివాసరావు, ప్రత్తిపాటి పుల్లారావు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కన్నా లక్ష్మీనారాయణ, నక్కా ఆనంద బాబు, భాష్యం ప్రవీణ్, జిల్లా సహకార బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, డాక్టర్ చదలవాడ అదిత్యా, నరసరావుపేట మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, సత్తెనపల్లి వైసీపీ ఇన్‌చార్జి డాక్టర్ గజ్జల సుదీర్‌బార్గవ్‌రెడ్డి, గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి, డాక్టర్ కారసాని శ్రీనివాసరెడ్డి, జనసేన రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ జిలాని, కాకుమాను పెదపేరిరెడ్డి, నాగసరపు సుబ్బరాయగుప్తా, కపిలవాయి విజయకు మార్, డాక్టర్ కడియాల వెంకటేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర నాయకుడు వై.చెంచయ్య, కాసా రాంబాబు తదితరులు నల్లపాటి భౌతికాయాన్ని సందర్శించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుమారులు రామచంద్ర ప్రసాదు, వంశీ మోహన్‌కు ప్రగాడ సానుభూతి తెలిపారు.

‘బంగారు’ బాపట్ల !

(5వ పేజీ తరువాయి)

నిర్వహిస్తున్నారు. ఇందులో డీఆర్డీఏ విభాగం కీలకంగా పనిచేస్తోంది. మార్గదర్శకుల ద్వారా కేవలం ఆర్థిక సాయం మీదే దృష్టి పెట్టకుండా కెరీర్ గైడెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి కల్పన, బ్యాంకుల ద్వారా రుణాలను వీలైనన్నీ ఎక్కువ మార్గాల ద్వారా బంగారు కుటుంబాలకు చేయూత అందించే దిశగా ప్రభుత్వం అడుగులేస్తోంది. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ఎక్కువగా డీఆర్డీఏ విభాగంతో అనుసంధానమై ఉన్నాయి. దీంతో అర్హత ఉన్న పేద కుటుంబాలకు తొలుత సంక్షేమం పక్కాగా అందించడానికి యంత్రాంగం ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే జిల్లా అధికారి మొదలుకుని మండల స్థాయిలోని డీఆర్డీఏ యంత్రాంగాన్ని పీ-4లో భాగస్వాములుగా చేశారు.

అమలులో అప్రమత్తంగా ఉండాలి

నిరుపేదల మేలు కోసమే పీ-4ను ప్రభుత్వం అమలు చేస్తోంది. ఆర్థికంగా బలంగా ఉన్నవారు కూడా బంగారు కుటుంబాల జాబితాలో చేరేందుకు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించడమో.. స్థానికంగా ఉండే అధికార పార్టీ నేతల ఒత్తిళ్ల ద్వారా పీ4 ద్వారా ఆయాచిత లబ్ధి పొందే ప్రయత్నాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో ఈ ఫలాలు అర్హులకే అందాలంటే.. బంగారు కుటుంబాల ఎంపికలో యంత్రాంగం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంది.

తొలి ఏకాదశి తిరుణాళ్లకు సర్వం సిద్ధం



కొండపై భక్తుల కోసం నూతనంగా ఏర్పాటు చేసిన ఘాట్‌రోడ్డు

వినుకొండ, జూలై 5, (ఆంధ్రజోతి) కొండపై వేంచేసి ఉన్న రామలింగేశ్వరస్వామి తిరుణాల మహోత్సవం ఆదివారం వైభవంగా నిర్వహించనున్నారు. తొలి ఏకాదశి పండగను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. ఇప్పటికే అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటల సమయంలో ఏర్పాటు చేసిన అఖండ జ్యోతి వెలిగించే కార్యక్రమం తిరుణాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. 40 ఆర్టీసీ బస్సులను ఆర్టీసీ సిద్ధం చేసింది. 500 మంది పోలీసులు శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

బాధితుడి ఇంటికి విద్యుత్‌శాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



వివరాలు సేకరిస్తున్న విద్యుత్ శాఖ అధికారులు

వినుకొండటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హనుమాన్ నగర్‌లో ఇట్లాపురం ఫరీద్ సాయిబు ఆధార్ కార్డుపై 150 విద్యుత్ మీటర్ల కనెక్షన్లు చూపడం అధికారులు స్పందించారు. ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంతో విద్యుత్ శాఖ అధికారులు ఆఘమేఘాలతో బాధితుడు ఫరీద్ సాహెబ్ ఇంటి వద్దకు చేరుకొన్నారు. రేకుల షెడ్‌కు ఉన్న 21011 నంబరుపై మీటర్లు ఏమీ లేవంటూ వివరణ ఇచ్చారు. గతంలో మున్సిపల్ సచివాలయ అడ్మిన్ చేసిన పొరపాటు కారణంగా ఫరీద్ సాయిబు ఆధార్‌కార్డుపై 5వేల గజాల ఇంటి స్థలం ఉన్నట్లు (123 ఇళ్లు) సచివాలయం, విద్యుత్ శాఖ అధికారులు గుర్తించారు. తన ఆధార్‌కార్డుపై ఇంటి నంబర్లు లేనికారణంగా మీటరు నంబర్లు నమోదైన ఉండవచ్చని సచివాలయ సిబ్బంది తెలిపారు.మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారులు చొరవ తీసుకొని ఆధార్‌కార్డుపై నమోదైన 123 ఇళ్లను తొలగించాల్సి ఉందని సచివాలయ సిబ్బంది తెలిపారు. దీంతో ఫరీద్ సాయిబు, భార్య హుస్సేన్‌బీ సంతోషం వ్యక్తం చేశారు.

చర్లపల్లి - సిల్చార్ ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోటా సవరణ

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి శనివారం గుంటూరు మీదగా ప్రయాణించే 12513 చర్లపల్లి - సిల్చార్ సూపర్ ఫాస్టు ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోటాని రైల్వే శాఖ సవరించింది. ఈ రైలుకు జనరల్ కోటాలో ఏసీ టూటైర్‌కు గతంలో ఐదు ఉంటే ఇప్పుడు 41కి పెంచారు. ఏసీ త్రీటైర్ 34 బెర్తులను 124కి, ఏసీ త్రీటైర్ ఎకానమి 16 నుంచి 75కు, స్లీపర్ క్లాస్‌ని 15 నుంచి 234కి పెంచారు. దీంతో ఈ రైలుకు జనరల్ కోటాలో బెర్తులు పుష్కలంగా అందుబాటులో ఉంటాయి.

నెమలిపురం మార్గంలో స్లీపర్ క్లాస్‌కే డిమాండ్

● ఏసీ బెర్తుల్లో 90 శాతానికి పైగా ఖాళీ

గుంటూరు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో కొత్తగా ప్రయాణికుల రైళ్ల ట్రాఫిక్‌కు ప్రారంభించిన పిడుగురాళ్ల - నెమలిపురి - రొంపిచర్ల - వినుకొండ - నంద్యాల మార్గంలో స్లీపర్‌క్లాస్ బెర్తులకే ఆదరణ లభించింది. ఈ మార్గంలో నడిచిన ప్రథమ సర్వీసులకు ఏసీ తరగతుల్లో ప్రయాణించేందుకు ప్యాసింజర్లు ఆసక్తి చూపించలేదు. దీంతో ఏసీ బోగీలు దాదాపుగా 90 శాతం పైగా ఖాళీగా కనిపించాయి. అయితే రాబోయే రోజుల్లో ఏసీ తరగతులకు కూడా డిమాండ్ పెరిగే అవకాశం ఉందని వివిధ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. 07190 తిరుపతి - నాందేడ్ స్పెషల్ ట్రైన్ రైలు బయలుదేరడానికి కొద్ది ముందుగా రెండో ఛార్టు సిద్ధమయ్యేనాటికి స్లీపర్‌క్లాస్‌లో బెర్తులు దాదాపుగా బుకింగ్ అయ్యాయి. ఈ రైలుకు స్లీపర్ క్లాస్ బోగీలు ఏడు ఉండగా బెర్తులు 560 అందుబాటులో ఉంచారు. వాటిల్లో 14 మినహా అన్ని బుకింగ్ కావడంతో భర్తీ శాతం 97.50గా నమోదైంది. ఏసీ త్రీటైర్‌లో ఆరు బోగీలుండగా 432 బెర్తులు అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే వాటిల్లో కేవలం 41 మాత్రమే బుకింగ్ కాగా 391 ఖాళీగా ఉన్నాయి. త్రీటైర్‌లో బెర్తుల భర్తీ శాతం 9.49గా నమోదైంది. ఏసీ టూటైర్‌లో మూడు బోగీలుండగా 156 బెర్తులు అందుబాటులో ఉంచారు. వాటిల్లో కేవలం 16 మాత్రమే బుకింగ్ అయ్యాయి. 140 ఖాళీగా ఉండటంతో భర్తీ శాతం 10.26గా ఉంది. చాలామంది ప్రయాణికులకు ఈ రైలు గురించి సరైన సమాచారం లేదని రైల్వేవర్గాలు అంటున్నాయి. వచ్చే వారం నుంచి ఆదరణ పెరిగే అవకాశం ఉందని, ఈ రైలు ఆదివారం తిరుపతి నుంచి నాందేడ్‌కు నడిపితే డిమాండ్ పెరగొచ్చని చెబుతున్నాయి.

కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ



రైతులు తెచ్చిన పొగాకును పరిశీలిస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మార్కెట్ యార్డులోని మార్క్ ఫెడ్ కొనుగోలు కేంద్రాన్ని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ఆకస్మికంగా సందర్శించారు. పండుటాకు పొగాకును కొనుగోలు చేయడం లేదని, దీంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు చేసిన ఫిర్యాదును వారు పరిశీలించారు. మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయశాఖ కమిషనర్ ఢిల్లీరావుకు ఫోన్ చేసి సమస్యను వివరించారు. పండుటాకుకు కనీసం రూ.4 వేలు మద్దతు ధరగా నిర్ణయించి, తిరస్కరణ లేకుండా కొనుగోలు చేయాలని కోరారు. రైతులు రూ.5 వేలు మద్దతు ధర కోరుతున్నారని కూడా తెలిపారు. సానుకూల ఆదేశాలు రాకపోతే, ముఖ్యమంత్రి దృష్టికి మరోసారి తీసుకెళ్తామని ఎంపీ, ఎమ్మెల్యే రైతులకు చెప్పారు.

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం : ఎమ్మెల్యే జూలకంటి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్రప్రదేశ్ - 2047 లక్ష్యంగా.. నియోజకవర్గ అభివృద్ధే ప్రధాన ధ్యేయంగా అధికారులు పని చేయాలని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని కేసీపీ అతిథి గృహంలో నియోజకవర్గస్థాయి అధికారులతో ఆయన సమీక్షించారు. అలాగే అభివృద్ధి విషయంలో పరిశ్రమల పాత్రపై శ్రీపరాశక్తి, కేసీపీ, చక్ర సిమెంట్స్ సిబ్బందితో చర్చించారు. ఈ సందర్భంగా పీ4 విధానంలో నియోజకవర్గం వ్యాప్తంగా దాదాపు 13,285 బంగారు కుటుంబాలను ఎంపిక చేసినట్లు అధికారుల నివేదికలో పేర్కొన్నారు. పర్యాటకం, మత్స్యశాఖల అభివృద్ధికి విస్తారమైన అవకాశాలు మాచర్ల నియోజకవర్గంలో ఉన్నాయని ఎమ్మెల్యే జూలకంటి అధికారులకు వివరించారు. దీనికి సంబంధించిన ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ప్రతి మండలంలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను ఏర్పాటు చేసి రైతులను అవగాహన పర్చాలని వ్యవసాయ శాఖ ఏడీఏ జగదీశ్వరరెడ్డికి ఎమ్మెల్యే జూలకంటి సూచించారు. ఈ పంగులూరి పుల్లయ్య, స్పెషలాఫీసర్ గాయత్రిదేవి, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కేసీపీ జీఎం రమణ, ఏడీఏ జగదీశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో యువకుడి మృతి

గురజాలటౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): డెంగీతో ఓ యువకుడు మృతిచెందిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పట్టణానికి చెందిన షేక్ జాకీర్ షరీఫ్ (26) ఐదు రోజుల క్రితం జ్వరంతో బాధపడుతున్నాడు. పరీక్షలు చేయించగా డెంగీఅని తేలింది. గురజాలలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం తీసుకుంటూ.. పరిస్థితి విషమించడంతో గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు.

170 పాఠశాలలు.. జీరో అడ్మిషన్!

(5వ పేజీ తరువాయి)

పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు ఏటా విద్యాశాఖ అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పాఠశాలలు ప్రారంభించడానికి పది రోజుల ముందే బడిబాట పేరుతో తల్లిదండ్రులని ఉపాధ్యాయులు కలిసి.. అడ్మిషన్ల కోసం తమ వంతు కృషి చేసేవారు. ఈ ఏడాది బదిలీల షెడ్యూల్ కారణంగా అనేకమంది ఉపాధ్యాయులు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పాఠశాలలకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం కూడా బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించ లేదు. ఫలితంగా ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్లు భారీగా తగ్గిపోయినట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు.

తల్లికి వందనం నగదే..ప్రైవేట్ స్కూళ్ల ఫీజు..

ప్రైవేట్ పాఠశాలల పీఆర్వోలు(ప్రజా సంబంధాల అధికారులు) గ్రామ స్థాయికి చేరి విద్యార్థులను తమ స్కూళ్లలో చేర్పించేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నారు. మారుమూల గ్రామాలకు కూడా బస్సులను, ఆటోలను పంపించి విద్యార్థులను తరలిస్తున్నారు. ఫీజులు కూడా మొదట్లోనే.. పెద్ద మొత్తంలో వసూలు చేయకుండా ప్రభుత్వమిచ్చిన తల్లికి వందనం డబ్బులను మాత్రమే ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు ఆ నగదును ప్రైవేటు పాఠశాలలకు చెల్లించి.. తమ పిల్లల్ని అక్కడ చేర్పిస్తున్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ స్పందించకుంటే ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.90 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	106, 114, 125
చికెన్ విత్ స్కిన్(కిలో)	204.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	214.00


సుందరయ్య కాలనీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యరపతినేని, నేతలు

సుందరయ్య కాలనీ అభివృద్ధి ఘనత మనదే
● ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారు ప్రాంతం సుందరయ్య కాలనీలో అభివృద్ధి చేసిన ఘనత మనదేనని ఎమ్మెల్యే యరపతినేని పేర్కొన్నారు. శనివారం కాలనీలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీలో ఇంటింటికి వెళ్లి ఈ ఏడాది పాలనలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించారు. 2014-19లో కాలనీలో వీధిలైట్లు, సాగునీటి వసతి, విద్యార్థులకు పాఠశాల ఏర్పాటుచేసి తన సొంత ఖర్చుతో పాఠశాల కొనసాగిస్తున్నానని తెలిపారు. అర్హులైన వారికి ఇంటిపట్టాలు, రహదారులను త్వరలో నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, తురకా వీరస్వామి, కళ్లం రాజశేఖర్‌రెడ్డి, గంగినేని లీలావతి, కందిమళ్ల శ్రీను, నల్లపాటి ధనుంజయ్, జొన్నలగడ్డ శ్రీను, బొల్లా శ్రీను, ఎల్‌వీఆర్, తదితరులు పాల్గొన్నారు.

తొలి ఏకాదశి ఏర్పాట్లు పూర్తి

పిడుగురాళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి సందర్భంగా ఆదివారం గుత్తికొండబిలంలో అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. గుంటూరు, ప్రకాశం జిల్లాల నుండి వేలాదిగా తరలిరానున్న భక్తులకు బిలం లోపల స్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేయడంతో పాటు పలు గ్రామాల దాతల నుండి ఉచిత అన్నదానాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. గుత్తికొండ గ్రామస్తులు గ్రామం నుండి భక్తులకు ఉచిత వాహన సౌకర్యాలను ఏర్పాటు చేశారు.

వైకుంఠపురంలో..

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఆదివారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా మండలంలోని వైకుంఠపురం వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద ఏర్పాట్లుపూర్తిచేశారు. దాతల సహకారంతో అన్నప్రసాదపంపిణీ చేయనున్నారు. ఆలయ ప్రాంగణంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. స్నాన ఘాట్ వద్ద ప్రత్యేక గదులు, కొండపై తాగునీరు ఏర్పాటుచేసినట్లు ఈఓ విశ్వనాథ్ తెలిపారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): తొలి ఏకాదశి పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు మండల దేవదాయ శాఖ అధికారి ఆవుల వెంకటేశ్వరరెడ్డి పేర్కొన్నారు. బెల్లంకొండ కొండపైన శివాలయంలో భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండ కింద భాగాన, కొండ పైకి వెళ్ళి వచ్చే భక్తుల కోసం దద్దోజనం, పులిహోర, మంచినీటి వసతి పూర్తి చేసినట్టు తెలిపారు.

రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయండి

సత్తెనపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): కడపలో ఈనెల 12, 13 తేదీల్లో జరిగే జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహా సభలను జయప్రదం చేయాలని వేదిక రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రత్యూష సుబ్బారావు పిలుపునిచ్చారు. శనివారం ఎన్ఎస్‌పీ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కార్యాలయంలో జిల్లా జనవిజ్ఞాన వేదిక మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ సమాజానికి వేదిక ఆవశ్యకత ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎం ఏడుకొండలు, కంభాల శ్రీనివాస్, బత్తుల కోటేశ్వరరావు, చలమారెడ్డి, బత్తిన శ్రీనివాసబాబు, సుభానీ, రామేశ్వర రెడ్డి, కంభాల ఆనంద్, ప్రేమ్‌కుమార్, అప్పారావు పాల్గొన్నారు.

8న అరుణాచలానికి బస్సు

సత్తెనపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): సత్తెనపల్లి డిపో నుంచి అరుణాచలానికి బస్సు సర్వీసు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ విజయకుమార్ శనివారం తెలిపారు. ఈనెల 8వ తేదీ రాత్రి 9గంటలకు సత్తెనపల్లి డిపోనుంచి సూపర్ లగ్జరీ బస్సు అరుణాచలం బయలు దేరుతుందని ఆయన తెలిపారు. 9వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ చూసుకొని అదేరోజు రాత్రి అరుణాచలం చేరుతుందన్నారు. దర్శనం అనంతరం 10వ తేదీ కంచికి బయలుదేరుతుందన్నారు. అనంతరం 11వ తేదీ ఉదయం బస్సు సత్తెనపల్లి చేరుతుందన్నారు. టిక్కెట్ రానుపోను ఒక్కొక్కరికి రూ.2500 అన్నారు. సత్తెనపల్లి ప్రాంతంలోని భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 99592 25429 నెంబరులో సంప్రదించాలన్నారు.

సీఎంను కలసిన నాగోతు, కనుమూరి


ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కలసిన నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరి

సత్తెనపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): టీడీపీ రాష్ట్ర నాయకులు నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరిలు శుక్రవారం రాత్రి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ఆయన గృహంలో కలిశారు. నకరికల్లు మండలం కుంకలగుంట, చేజర్ల గ్రామాల్లోని కాపులను 2013 ముందు ఏవిధంగా ఐతే జీవో నెం.1793/1970 ప్రకారం బీసీఏగా గుర్తించారో మరలా అదేవిధంగా గుర్తించాలని చంద్రబాబును కోరారు. ఇది ఎన్నికల హామీ అని చంద్రబాబుకు వారు విన్నవించారు. గతంలో బీసీలుగా ఉన్నవారిని నాటి ప్రభుత్వాలు రాజకీయ కక్షతో బీసీల నుంచి తొలగించాయని తెలిపారు వెంటనే స్పందించిన సీఎం తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్టు వారు తెలిపారు. నకరికల్లు మండలంలో గంజాయి మాఫియాను అరికట్టాలని, రౌడీషీటర్ల ఆగడాలు కట్టడి చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరినట్టు వారు తెలిపారు.

8న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 8వ తేదీ మధ్యాహ్నం 2గంటలకు జరుగుతుందని ఎంపీడీవో టి.పార్వతి తెలిపారు.

అధిక ధరలకు విత్తనాలు విక్రయించొద్దు

పిడుగురాళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): వ్యవసాయశాఖ నిర్ణయించిన నిర్ణీత ధరకే ఎరువులు, విత్తనాలను విక్రయించాలని పిడుగురాళ్ల వ్యవసాయశాఖ అధికారి సంధ్యారాణి తెలిపారు. శనివారం పిడుగురాళ్లలో విత్తనాల డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఏఓ మాట్లాడుతూ ఎంఆర్‌పీ ధరలకే పత్తి విత్తనాలు విక్రయించాలని, బీటీ-3 పత్తి విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, వాతావరణ పంటల బీమా పేరిట రెండు పథకాలను ప్రవేశపెట్టిందని, రైతులు గడువులోగా సొమ్ము చెల్లించి పంటలకు బీమా చేయించుకోవాలన్నారు.


విత్తన డీలర్లతో మాట్లాడుతున్న ఏవో సంధ్యారాణి

కూటమి పాలన స్వర్ణయుగం
● ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి


మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బ్రహ్మనందరెడ్డి

మాచర్లటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలన స్వర్ణయుగాన్ని తలపిస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని 18, 19, 20 వార్డుల్లో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇం టింటికి తిరిగి అందరి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో పాలకులు పూర్తిగా అభివృద్ధిని గాలికి వదిలేశారన్నారు. సీఎం చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలోపెట్టి అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్తున్నారన్నారు. ఎన్నికల హామీ సూపర్ 6 పథకాలను అమలు చేస్తున్నామన్నారు. పట్టణంలో దశలవారీగా అభివృద్ధి పనులు చేపడుతూ వస్తున్నామన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో ఎమ్మెల్యే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్, వైస్ చైర్‌పర్సన్ యర్రాకుల సిద్ధమ్మ, యెనుముల కేశవరెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, రెడ్యా నాయక్, పేరువాల పుల్లారావు, మాచర్ల వాసు, రాజబోయిన మధుయాదవ్, మద్దిగపు చిన వెంకట్రామిరెడ్డి, జగడాల శ్రీను, షేక్ మస్తాన్, తిక్కా కొండలు, దుర్భాకుల ప్రసాద్, వజ్రంనాయక్, రాజారత్నం, సంభోజు వేణు, బూసాని వేణు, కొమెర అనంతరాములు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబును విమర్శించే అర్హతలేదు..

రెంటచింతల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నమ్మిన వారిని నట్టేట ముంచిన జగన్‌కు సీఎం చంద్రబాబును విమర్శించే అర్హత లేదని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ జగన్ మాటలు విని కుటుంబాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. టీడీపీ నేతల బిల్లులు చేయకుండా గత పాలకులు ఇబ్బందులు పెట్టి నగదు డ్రా చేసినట్లు తెలిసిందని అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, అల్లం ప్రతాపరెడ్డి, రవికిరణ్‌రెడ్డి, రామకృష్ణ, రాయపరెడ్డి, ప్రభురాజ్ యాదవ్, పుల్లయ్యసాయి, సిద్దయ్య, శిల్వరాజ్, జ్ఞానయ్య పాల్గొన్నారు.

● మాచర్లటౌన్: పట్టణంలోని జెండాచెట్టు వద్ద శనివారం మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్, షేక్ సుభాని, యెనుముల కేశవరెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం చంద్రబాబుతోనే సాధ్యం

సత్తెనపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 20వ వార్డులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో కన్నా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి పథకాల కరపత్రాలను పంపిణీచేశారు. ప్రజలకు సంక్షేమ పథకాలను అందుతున్నాయో లేదో అడిగి తెలుసుకున్నారు. సమస్యలను మై టీడీపీ యాప్‌లో కన్నా స్వయంగా నమోదు చేశారు.


కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కన్నా

సీఎం సహాయనిధితో పేదల ఆరోగ్యానికి భరోసా

ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో శనివారం సీఎం సహాయనిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో చౌట శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు, స్వామి, వక్కంటి అజయ్, శోభారాణి, మక్కపాటి రామచంద్రరరావు, మక్కపాటి రవిచంద్ర, జవ్వాజి రామ్మోహనరావు, పూజల వెంకటకోటయ్య, మస్తాన్‌వలి, ఎం శారదాదేవి, ఆళ్ళ అమరేశ్వరరావు, సాంబయ్య, నూర్‌బాషా జాన్‌బాబు, ఏ నరసింహారావు, వీర భాస్కర్‌రెడ్డి, కే శంకరరావు, కే శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

స్టేడియంలో అభివృద్ధి పనుల పరిశీలన

సత్తెనపల్లిలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడామైదానాన్ని అభివృద్ధి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కన్నా అన్నారు. పట్టణంలోని రైల్వే స్టేషన్ రోడ్డులో స్టేడియం అభివృద్ధి పనులను శనివారం ఆయన అధికారులు, కూటమి నేతలతో పరిశీలించారు. ఈనెల 9వ తేదీన రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో వాటిని పరిశీలించారు. ఆయన వెంట పల్నాడు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, మునిసిపల్ కమిషనర్ ఆనంద్‌కుమార్, పలువురు పీడీలు, పీఈటీలు ఉన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో 247 కేసుల పరిష్కారం


పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టులో లోక్‌అదాలత్ నిర్వహిస్తున్న న్యాయాధికారి ప్రవల్లిక


సత్తెనపల్లి: అదాలత్‌లో పాల్గొన్న సీనియర్ సివిల్ జడ్జి విజయ కుమార్‌రెడ్డి


లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్

మాచర్లటౌన్, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో శనివారం న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ ఆధ్వర్యాన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ అదాలత్‌లో 247 కేసులు పరిష్కారమయ్యారు. వీటిలో సివిల్ 12, బ్యాంకు 8, ఈపీ 18, క్రిమినల్ 63, ఎక్సైజ్ 15, చెక్‌బౌన్స్ 7, ఎస్‌టీసీ క్రిమినల్ 117, ప్రిలిటిగేషన్ 7 కేసులు ఉన్నాయి. ఈ అదాలత్‌లో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యల్లాల రమేష్, మెట్టు గోవిందరెడ్డి, న్యాయవాదులు పాల్గొన్నారు.

227 పరిష్కారం: న్యాయాధికారి ప్రవల్లిక

పిడుగురాళ్ల, జూలై 5(ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల జూనియర్ సివిల్ కోర్టు నందు శనివారం జాతీయ లోక్ అదాలత్, న్యాయ అవగాహన సదస్సు జరిగింది. న్యాయాధికారి టీ ప్రవల్లిక మాట్లాడుతూ ఉచిత న్యాయ సేవలు, చట్టాల గురించి, లోక్‌అదాలత్ ప్రాముఖ్యతను వివరించారు. గ్రామస్థాయిలో ఎటువంటి గొడవలు, అల్లర్లకు తావులేకుండా ఎక్కడికక్కడ పెద్దల ద్వారా రాజీ కుదుర్చుకునే మార్గాన్ని ఆయా గ్రామాల ప్రజలు ఎంచుకోవాలన్నారు. ఈ అదాలత్‌లో 11 సివిల్ కేసులు, 57 క్రిమినల్ కేసులు, 15 చెక్ బౌన్ కేసులు, 5 మనోవర్తికేసులు, 2 గృహహింస కేసులు, ఇతర క్రిమినల్ కేసులు 80, ఇలా మొత్తం 227 కేసులను పరిష్కరించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు కుమారస్వామి, వెంకటేశ్వర్లు, న్యాయవాదులు కోటేశ్వరరావు, ఎస్‌కె మౌలాలి, ఎస్‌వీ కోటేశ్వరరావు, అయాజ్ అహ్మద్, ప్రశాంత్‌కుమార్ నాయక్, ఎ.సీతరామయ్య, మందా జాకబ్, రూత్ బనియన్, ఎం వెంకటేశ్వర్లు, సాగర్ పాల్గొన్నారు.

మెగా లోక్ అదాలత్

సత్తెనపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో శనివారం నాలుగు బెంచ్‌లుగా మెగా లోక్‌అదాలత్‌ను నిర్వహించారు. నాలుగు న్యాయస్థానాల పరిధిలోని పలు కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించారు. న్యాయమూర్తులు జీ విజయ కుమార్‌రెడ్డి, కౌషిత్ హుస్సేన్, ప్రియదర్శిని, సుజిత్ కుమార్‌లతోపాటు లోక్ అదాలత్ సభ్యులు అనీల్ కుమార్, నాగార్జున, రవి, శ్రీనివాసరావుతో పాటు పలువురు న్యాయవాదులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలి


పెదకూరపాడు: విద్యుత్ శాఖ అధికారులకు వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు


దాచేపల్లి: విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

పెదకూరపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై విద్యుత్‌శాఖ పెనుభారాన్ని మోపిందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, అరసం రాష్ట్ర కార్యదర్శి కొమ్మాలపాటి శరత్‌చంద్ర జ్యోతిశ్రీ అన్నారు. సీపీఐ ఆధ్వర్యంలో పెదకూరపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శనివారం పెరిగిన విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ప్రజానాట్య మండలి జిల్లా ప్రధానకార్యదర్శి బైరాపట్నం రామకృష్ణ మాట్లాడుతూ స్మార్ట్ మీటర్ల బిగింపును అందరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు, మండల కార్యదర్శి షేక్ నాగుల్ మీరా, దాసు, చల్లపల్లి పానయ్య తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): అచ్చంపేటలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ సర్దుబాటు పేరుతో నాలుగుసార్లుగా ప్రజలపై వేసిన భారాన్ని తగ్గించాలని సీపీఐ మండల కార్యదర్శి షేక్ మస్తాన్ బుజ్జి అన్నారు. స్మార్ట్ మీటర్లను ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల నాయకులు బి.శ్రీనివాసరావు, సుబ్బారావు, వెంకటేశ్వరరావు, మధు ఉన్నారు.

● క్రోసూరు, జూలై 5(ఆంధ్రజ్యోతి): గృహాల్లో స్మార్ట్ మీటర్ల బిగింపు నిర్ణయాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఆధ్వర్యంలో క్రోసూరు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఐ కార్యదర్శి పోతుగంటి నాగేశ్వరరావు మాట్లాడుతూ ఎవరైనా స్మార్ట్‌మీటర్లు బిగించటానికి గృహాలకు వస్తే అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ధర్నాకు సీపీఐ నాయకులు యాదగిరి తిరుపతిరావు, మేకల గోపీ శ్రీనివాష్, నీరుకొండ శ్రీనివాసరావు, మహేష్, నాగరాజు తదితరులు ఆధ్వర్యం వహించారు.

● దాచేపల్లి, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉప సంహరించుకోవాలని సీపీఐ పల్నాడు జిల్లా ఏరి యా సహాయకార్యదర్శి షేక్ హుస్సేన్ ప్రభుత్వాన్ని కోరారు. దాచేపల్లిలో సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేశారు. పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలతో ప్రజలపై రూ.15వేల కోట్ల భారాన్ని మోపారని ఆరోపించారు. కార్యక్రమంలో మందపాటి రమణారెడ్డి, కొమెర వెంకటరావు, మురికిపూడి సరవయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు పండ్లతోటలు సాగుచేయాలి

ముప్పాళ్ళ, జూలై 5(ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, చిన్న సన్నకారు రైతులు తమ పొలాల్లో పండ్లతోటల సాగుకు ఉపాధిహామీ పథకం ద్వారా ప్రోత్సాహకం అందిస్తుందని ఏపీఓ ఏడుకొండలు తెలిపారు. మండలంలోని రుద్రవరంలో ఉపాధి నిధులతో సాగుచేస్తున్న పండ్లతోటలను ఏపీఓ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ లబ్ధిదారులకు పండ్లు, పూల తోటలసాగుపై శిక్షణ ఇస్తామన్నారు.

మహిళా సర్పంచ్‌లకు శిక్షణ

సత్తెనపల్లి రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సత్తెనపల్లి, పిడుగురాళ్ళ, పెదకూరపాడు, రాజుపాలెం మండలాలకు చెందిన మహిళా సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. శనివారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరెడ్డి ప్రసంగించారు. కార్యక్రమంలో ట్రైనింగ్ డిప్యూటీ ఎంపీడీవో పూర్ణచంద్రరరావు, రూపవతి తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదంలో రైస్‌మిల్లు దగ్ధం

నకరికల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంకలగుంటలో శనివారం తెల్లవారుజామున శ్రీరామ కుసుమ హరనాథ్ రైస్ మిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. షార్ట్‌సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు చెపుతున్నారు. తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగటంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు మంటలను ఆర్పి వేశారు. ఈ మంటల్లో యంత్రాలన్నీ దగ్ధమయ్యాయి. మిల్లు లోపల ఉన్న ధాన్యం, ముడి బియ్యం కాలిపోయాయి.

విద్యార్థికి ఆర్థిక సాయం

అచ్చంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్నేహహస్తాల ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లోని తండాకు చెందిన ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థి జరుపుల అరవింద్ నా యక్‌కు రూ.40వేల ఆర్థికసాయం సీఐ పీ శ్రీనివాసరావు ద్వారా శనివారం అందించారు. ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ తాయి కరిముల్లాబాబు తదితరులు పాల్గొన్నారు.

గ్రూపు రాజకీయాలను ప్రోత్సహించరాదు

బెల్లంకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలంలో గ్రూపు రాజకీయాలకు తావివ్వరాదని వైసీపీ మండల అధ్యక్షుడు అన్నపరెడ్డి నర్సిరెడ్డి పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద కొల్లూరు ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో మండల వైసీపీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టారు.

లేబర్ కోడ్‌ను రద్దు చేయాలి

పెదకూరపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ను రద్దు చేయాలని వీఆర్‌ఏల సంఘం, సీఐటీయూ ప్రతినిధులు తహసీల్దార్ నీలి ధనలక్ష్మికి వినతిపత్రం అందించారు. పెదకూరపాడులో శనివారం సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు మల్లేశ్వరి ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందించారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నకరికల్లు, జూలై 5(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సత్తెనపల్లి రూరల్ సీఐ కిరణ్ అన్నారు. శనివారం గుండ్లపల్లి గ్రామంలో శాంతిభద్రతలపై ప్రజలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి అందరి కదలికలు గమనిస్తున్నట్టు తెలిపారు. సమస్యలు ఏమైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ సీహెచ్ సురేష్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి
● ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ


మాట్లాడుతున్న ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ

బెల్లంకొండ, జూలై 5(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం ప్రారంభం కావటంతో వైద్య సిబ్బంది సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ పేర్కొన్నారు. శనివారం బెల్లంకొండ ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఎంపీపీ అధ్యక్షత వహించి మాట్లాడుతూ వర్షపు నీరు, మురుగునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అందరూ కలసికట్టుగా మండల అభివృద్ధికి కృషి చేద్దామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో శ్రీనివాస నాయక్, మండల స్థాయి అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మిట్టపాలెంలో సుపరిపాలన తొలి అడుగు


అచ్చంపేట: మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం గ్రామంలో శనివారం రాత్రి ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇల్లిల్లు తిరుగుతూ ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సూపర్-6 పథకాలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే ప్రవీణ్ తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం, డీసీ చైర్మన్ పసుపులేటి పాపిరెడ్డి, వెనిగండ్ల కోటయ్య, చిమతా శ్రీనివాసరవు, పసుపులేటి విష్ణు, సాదా మంగయ్య, నెల్లూరి శ్రీనివాసరావు, బత్తుల వేదాద్రి, కన్నా కోటయ్య, మందడపు రామచంద్రయ్య, మొక్కపాటి గిరిబాబు, నల్లమేకల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే ప్రవీణ్ సమీక్ష

పెదకూరపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్‌లో భాగంగా నియోజకవర్గంలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహంలో శనివారం జరిగిన ఈ సమీక్షలో పేదరిక నిర్మూలన అంశంపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, తెలుగు రైతు జిల్లా ప్రధానకార్యదర్శి భాష్యం ఆంజనేయులు, టీడీపీ జిల్లా నాయకులు కన్యదార వసంతరావు, షేక్ ముంతాజ్, డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, షేక్ మస్తాన్‌షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ మండల అధ్యక్షుడు ఏటుకూరి బ్రహ్మయ్య అన్నారు. మండలంలోని లగడపాడులో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వట్టికూటి శివరామకృష్ణయ్య, టీడీపీ మండల నేతలు బెల్లంకొండ రామగోపాలరావు, భాష్యం ఆంజనేయులు, గల్లా బాబూరావు, వడ్లమూడి అప్పారావు, షేక్ ముంతాజ్, షేక్ అజ్మల్లా, వై.వెంకటేశ్వరరావు, రావెల బుచ్చయ్యచౌదరి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మర్రెడ్డి అజాత శత్రువు
● ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి

రెంటచింతల, జూలై 5(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ సర్పంచ్ అల్లం మర్రెడ్డి అజాతశత్రువని.. ప్రజల మన్ననలను పొందారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మనందరెడ్డి అన్నారు. శనివారం రెంటచింతలలో అల్లం మర్రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అల్లం ప్రతాపరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు అబ్బిరెడ్డి, గొంటు రవికిరణ్, బి.రామకృష్ణ రాయపరెడ్డి, పంగులూరి పుల్లయ్య తదితరులున్నారు.

చదరంగంతో విద్యార్థుల్లో ఏకాగ్రత
● మున్సిపల్ చైర్మన్ మదార్‌సాహెబ్

మాచర్ల రూరల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చదరంగం ఆడడం వలన విద్యార్థుల్లో ఏకాగ్రత మెరుగవుతుందని మున్సిపల్ చైర్మన్ షేక్ మదార్‌సాహెబ్ అన్నారు. శనివారం పట్టణంలో పల్నాడు చెస్ అకాడమి ఆధ్వర్యాన వాసవీ క్లబ్ మాచర్ల చెన్నకేశవ సహకారంతో అండర్-15 చదరంగ పోటీలు నిర్వహించారు. వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు అధ్యక్షత వహించారు. 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు భవనాసి రవితేజ, కార్యదర్శి బత్తుల వీరబ్రహ్మం, కోశాధికారి బచ్చు రాజ్‌కుమార్, మేడం నాగేశ్వరరావు, తిరువీధి వెంకట నాగేశ్వరరావు, చుండూరు సత్యనారాయణ, చెస్ కోచ్ కిరణ్, పాపారావు, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 5(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం శనివారం నాటికి 524.70 అడుగులు ఉంది. ఇది 157.98 టీఎంసీలకు సమానం. ఎడమ కాలువ ద్వారా 3146 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ 1350, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 4496 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జునసాగర్‌కు ఇన్‌ఫ్లోగా 56,718 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

పులిచింతల...

అచ్చంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): పులిచింతల ప్రాజెక్టులో శనివారం 16.74 టీఎంసీల నీటి నిల్వ ఉన్నట్టు పులిచింతల ప్రాజెక్టు ఏఈ రాజు తెలిపారు. 4,600 క్యూసెక్కుల నీరు పవర్ జనరేషన్ ద్వారా, 400క్యూసెక్కులు లీకుల ద్వారాను మొత్తం 5వేల క్యూసెక్కుల నీరు దిగువ కృష్ణకు విడుదల అవుతుంది.

షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు దగ్ధం

దుర్గి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో సెలూన్ షాపు దగ్ధమైన సంఘటన దుర్గిలో శనివారం జరిగింది. దుర్గికి చెందిన దుర్గి వీరయ్య గ్రామంలోని ఆంధ్రాబ్యాంకు ఎదురుగా ఇటీవల షాపు ఏర్పాటు చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున షాపులో షార్ట్ సర్క్యూట్‌తో మంటలు వ్యాపించాయి. మాచర్ల స్టేషన్‌కు సమాచారం అందించగా సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. షాపులో సామాగ్రి పూర్తిగా కాలిపోయాయి. వీఆర్వో వెంకటేశ్వర్లు వివరాలు నమోదు చేసుకున్నారు.

ద్విచక్రవాహనం.. ఆర్టీసీ బస్సు ఢీ
● ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

రెంటచింతల, జూలై 5(ఆంధ్రజ్యోతి): గుంటూరు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలైన సంఘటన శనివారం రెంటచింతలలో జరిగింది. ఎస్ఐ నాగార్జున కథనం మేరకు.. మంచికల్లు గ్రామం నుంచి ద్విచక్రవాహనంపై వస్తున్న దాసరి రాజశేఖర్, తాయ నరసింహం మాచర్ల వెళ్తున్న ఆర్టీసీ బస్సును బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు గురజాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నరసరావుపేటకు తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

ట్రాక్టర్ ప్రమాదంలో యువకుడు మృతి

అచ్చంపేట, జూలై 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి గ్రామానికి చెందిన కొమ్మవరపు ప్రతాప్(19) శనివారం ట్రాక్టర్ తిరగబడి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పీ శ్రీనివాసరావు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్, ప్రతాప్ మృతదేహానికి నివాళులర్పించారు.

నేడు ఆరు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకూరపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆరు గ్రామాల్లో ఈనెల 6వ తేదీ ఉదయం విద్యుత్‌కు అంతరాయం ఉంటుందని ఆ శాఖ ఏఈ రామకృష్ణ శనివారం తెలిపారు. లగడపాడు, కన్నెగండ్ల, గారపాడు, హుస్సేన్‌నగరం, బుచ్చయ్యపాలెం, రామాపురం గ్రామాల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు విద్యుత్ కోత ఉంటుందన్నారు.

పెదకూరపాడులో బీఎల్‌వోలకు శిక్షణ

పెదకూరపాడు, జూలై 5(ఆంధ్రజ్యోతి): పెదకూరపాడు నియోజకవర్గంలోని బెల్లంకొండ, అచ్చంపేట బీఎల్‌వోలకు శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. పెదకూరపాడులోని జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈఆర్‌వో ప్రాజెక్టు డైరెక్టర్ ఎం ఉమాదేవి, తహసీల్దార్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్‌ను గాయపర్చిన నిందితుడి అరెస్టు

అమరావతి, జూలై 5(ఆంధ్రజ్యోతి): గత నెల 30వ తేదీన మండలంలోని మునగోడు గ్రామంలో పోలీసులను చూసి భయంతో కారును ర్యాష్‌గా పోనిచ్చి ఓ కానిస్టేబుల్‌ను ఢీకొట్టి గాయపర్చిన కేసులో నిందితుడు కె.వెంకట్రావును పోలీసులు శనివారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చినట్లు సీఐ అచ్చియ్య తెలిపారు. సమావేశంలో ఎస్ఐ అమీర్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌లో 852 కేసుల పరిష్కారం

నరసరావుపేట లీగల్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): న్యాయస్థాన భవనం ఆవరణలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ పదమూడో అదనపు జిల్లా న్యాయ అధికారి నేతి సత్యశ్రీ ఆధ్వర్యంలో న్యాయాధికారులు ఆరు బెంచ్‌లుగా ఏర్పడి 852 కేసులను పరిష్కరించారు. పరిష్కారమైన కేసుల్లో కక్షిదారులకు రూ.5,49,30,445 మేరకు పరిహారం లభించింది న్యాయాధికారులు కె.మధుస్వామి, ఎస్.లావణ్య, ఆర్.ఆశీర్వాదంపాల్, ఏ సలోమి, ఎం.గాయత్రి, లోక్ అదాలత్ సభ్యులు కే.విజయ్‌కుమార్, చంద్రశేఖర్, రవిశంకర్, వై.సురేష్ బాబు, కే ఆనంద్ కుమార్, అచ్చి ఏడుకొండలు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

స్మార్ట్‌మీటర్లను వ్యతిరేకిస్తూ శివయ్య స్తూపం వద్ద నిరసన

వినుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వినుకొండలో స్మార్ట్ మీటర్లను బిగించే విధానాన్ని వ్యతిరేకిస్తూ శివయ్య స్తూపం సెంటర్‌లో సీపీఐ ఆధ్వర్యంలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పల్నాడు జిల్లా సీపీఐ అధ్యక్షుడు మారుతివరప్రసాద్ మాట్లాడుతూ వైసీపీ ప్రవేశపెట్టిన స్మార్ట్‌మీటర్లను చంద్రబాబునాయుడు కొనసాగించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. గత ప్రభుత్వ హయాంలోని ఒప్పందాలను అమలు చేయతలపెట్టిన కూటమి ప్రభుత్వానికి నిరసన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ సంద్రపాటి సైదా, నియోజకవర్గ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఉలవలపూడి రాము తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

● నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): నరసరావుపేటలోని కోటబజార్ పులుపుల వారి వీధిలోని వీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనరసింహస్వామి ఆలయ రాతి నిర్మాణానికి లక్ష్మీనరసింహ జువెలరీ మార్టు అధినేత దద్దాల వెంకటేశ్వరరావు, పుష్పలత రూ.లక్ష విరాళంగా అందజేశారని కమిటీ సభ్యుడు వనమా కృష్ణ తెలిపారు.

● యడ్లపాడు: మండలంలోని ఉప్పరపాలెం పరిధిలోని కొండ క్వారీల్లో అక్రమ మైనింగ్ కార్యకలాపాలపై రెవెన్యూ, మైనింగ్, పంచాయితీ, పోలీసు శాఖల అధికారులతో చేపట్టిన ఉమ్మడి సర్వే ప్రక్రియ మూడో రోజైన శనివారం కొనసాగింది. అనుమతులు కలిగి ఉన్న నాలుగు క్వారీలలో సర్వే నిర్వహించిన అధికారులు రెండో రోజు గురువారం అనుమతులు లేని నాలుగు క్వారీలలో తనిఖీలు నిర్వహించారు.

● శావల్యాపురం: ప్రపంచ జూనోసిస్ డే సందర్భంగా ప్రభుత్వం పెంపుడు కుక్కలకు రాబిస్ టీకాలను ఉచితంగా అందజేస్తుందని వైద్యులు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని వేల్పూరు, శావల్యాపురం సెక్టార్ల పశువైద్యాధికారులు పాలపర్తి గణేష్‌కుమార్, జర్ని కావ్య శనివారం తెలిపారు.

● వయ్యకల్లు (శావల్యాపురం): మండలంలోని వయ్యకల్లు గ్రామంలోని ఊరచెరువులో చేపల పెంపకానికి సంబంధించి బహిరంగ వేలంను సోమవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శి శ్రీవల్లి శనివారం తెలిపారు. ముందుగా రూ.25వేలు డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని, పాటను దక్కించుకొన్న వారు పాటమొత్తం నగదును అధికారుల సమక్షంలో వెంటనే చెల్లించాలన్నారు.

● నరసరావుపేట టౌన్: ఆత్మానందం యోగ సాధనతో సాధ్యం అవుతుందని శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం అధినేత ఏ వెంకటేశ్వర గురూజీ అన్నారు. శనివారం నరసరావుపేట పట్టణంలోని పట్టాభిరామ స్వామి ఆలయం ప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వర కళ్యాణ మండపంలో 187వ ఉచిత యోగా శిక్షణ శిబిరం ముగింపు ఆనంద మహోత్సవం జరిగింది.

● నరసరావుపేట టౌన్: ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న డిగ్రీ కళాశాలలో సింగిల్ మేజర్ విధానం అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడంపై అఫిలియేటెడ్ కాలేజీ టీచర్స్ అసోసియేషన్-ఏపీ అభ్యంతరం వ్యక్తం చేస్తున్నట్లు అధ్యక్షుడు కొండ్రు మోహనరావు, జనరల్ సెక్రటరీ డాక్టర్ ఎం శ్రీనివాసరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఈనిర్ణయాన్ని పునః సమీక్షించి డబుల్ మేజర్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

● రొంపిచర్ల: మండలంలోని ఏపీ మోడల్ పాఠశాలలో శనివారం కిషోరి వికాస కార్యక్రమం శనివారం నిర్వహించారు. జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో లీగల్ సెల్ ప్రొటక్షన్ అధికారి ప్రశాంతి, ప్రిన్సిపాల్ రవినాయక్, విజయలక్ష్మి, శైలజ, షమీమ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: మండలంలోని తిరుమల ఇంజనీరింగ్ కళాశాలలో అధ్యాపకులకు ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు కళాశాల నిర్వాహకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 5వ తేదీ వరకు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి రావెల సత్యనారాయణ, 300మంది సిబ్బంది పాల్గొన్నారు.

● నరసరావుపేట టౌన్: కార్మికుల సమ్మెలకు మద్దతుగా వ్యవసాయరంగ రక్షణకై జిల్లా, మండల కేంద్రాలలో జరిగే నిరసన కార్యక్రమాలలో రైతులు పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని కోటప్పకొండ రోడ్డులో ఉన్న సంఘ కార్యాలయంలో గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. సమావేశంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు విజయకుమార్, సురేష్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

● నరసరావుపేట రూరల్: పల్నాడులోని 28మండల పరిషత్ అభివృద్ధి అధికారులకు, పంచాయతీ కార్యదర్శులకు, డిజిటల్ అసిస్టెంట్లకు, కంప్యూటర్ ఆపరేటర్లకు పంచాయతీ పురోగతి సూచిక వెర్షన్ 2.0 శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. శిక్షణలో నాగానంద్, రామకృష్ణ, డివిజనల్ లెవెల్ కో ఆర్డినేటర్ అహ్మద్ పాల్గొన్నారు.

చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో పలు శంకుస్థాపనలు



చిలకలూరిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగపడే చిలకలూరిపేట 100పడకల ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేస్తామని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం ప్రకటించారు. మూడు నియోజకవర్గాలకు కీలకమైన ఈ ఆసుపత్రిని 100పడకల నుంచి 300పడకలకు పెంచి, వైద్య కళాశాల ఏర్పాటుచేసే దిశగా ప్రభుత్వంతో చర్చిస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యటించిన వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఎంతో ఉపయోగపడే చిలకలూరిపేట ప్రధాన ఆసుపత్రిని గత పాలకులు పూర్తిగా నిర్లక్ష్యంచేశారన్నారు. గతంలో వైద్యారోగ్య మంత్రిగా పనిచేసిన వారు ఆసుపత్రికి రూపాయి కేటాయించలేదని విమర్శించారు. చిలకలూరిపేట 100 పడకల ఆసుపత్రి అభివృద్ధికి 2014-19లో టీడీపీ ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందని, ఇప్పుడు మరో రూ.9.46 కోట్లు మంజూరు చేసిందన్నారు. అంతకుముందు వారు ఆసుపత్రిలో రూ.9.46కోట్ల వ్యయంకాగల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ నిధులతో ఆసుపత్రిలో అంతర్గత రోడ్లు, ప్రహరీ, రిటైనింగ్ వాల్ నిర్మాణంతో పాటు అవసరమైన వైద్య పరికరాలను కొనుగోలు చేస్తారు. ఆసుపత్రి వైద్యులు, సిబ్బందితో

పాల్గొన్న ఎంపీ లావు, ఎమ్మెల్యే ప్రత్తిపాటి

వారు మాట్లాడి సమస్యలపై ఆరాతీశారు. రోగులను అడిగి వైద్యసేవలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ తోకల శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ పి.శ్రీహరి బాబు పాల్గొన్నారు.

ఐదు గ్రామాల్లో...

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలం దండమూడి, గొట్టిపాడు పంచాయతీ పరిధిలోని మిట్టపాలెం, ఈవూరివారిపాలెం, నాగభైరువారిపాలెం, గోరంట్లవారిపాలెం గ్రామాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం పర్యటించారు. మిట్టపాలెంలో రూ.8 లక్షలతో, గోరంట్లవారిపాలెంలో రూ.7లక్షలతో పూర్తిచేసిన అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకం, వాగుల్లో పూడికతీతతో పాటు ఇతర సమస్యల పరిష్కారానికి మొత్తం రూ.75లక్షలు వెచ్చించనున్నట్లు చెప్పారు. త్వరలోనే దండమూడి ఈవూరివారిపాలెం మధ్య రోడ్డు నిర్మిస్తామన్నారు. సమాజంలో అట్టడుగున ఉన్న పేదల్ని ఆర్థికంగా ఆదుకోవడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4 పథకాన్ని తీసుకొచ్చారన్నారు. అవినీతి మాజీమంత్రిని దూరం పెడితేనే నియోజకవర్గానికి భవిష్యత్తు ఉంటుందన్నారు. తల్లికి వందనం పథకం అందని వారు ఇప్పటికీ సచివాలయాల్లో తమ దరఖాస్తులు అందించి సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్‌మోహన్, కరీముల్లా, కందుల రమణ, అంబటి సోంబాబు, తాళ్లూరి సాంబశివరావు పాల్గొన్నారు.

పీ-4పై అధికారులతో ప్రత్తిపాటి సమీక్ష

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): పేదరికం లేని సమాజం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు పీ-4కు శ్రీకారం చుట్టారని, గ్రామాలకు చెందిన ఎన్నారైలతో స్థానిక నాయకులు, అధికారులు సమన్వయం చేసుకొని దానిని విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు శనివారం కోరారు. ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బంగారు కుటుంబాల ఎంపిక, మార్గదర్శుల పాత్ర, ప్రభుత్వ విధివిధానాలపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో గుర్తించిన 9,800 బంగారుకుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలన్నారు. ఈ కుటుంబాలకు అండగా నిలిచే మార్గదర్శుల ఎంపికపై యంత్రాంగం ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో మూడు మండలాల ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, జవ్వాజి మదన్ మోహన్, బండారుపల్లి సత్యనారాయణ, కామినేని సాయిబాబు, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి, కందుల రమణ పాల్గొన్నారు.



గొట్టిపాడు పంచాయతీ పరిధిలోని గ్రామంలో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు



బొల్లాపల్లిలో ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేస్తున్న చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

బొల్లాపల్లి, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏడాది పాలనలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందాయని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పేర్కొన్నారు. మండలంలోని బొల్లాపల్లిలో శుక్రవారం రాత్రి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు ఇంటింటికి వెళ్ళి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. మహిళలు, వృద్ధులు, విద్యార్థులతో మాట్లాడి సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ఇంకా సంక్షేమ పథకాలు అందని వారు ఉండి అర్హత కలిగి ఉంటే వెంటనే సచివాలయాల్లో దరఖాస్తులు అందజేయాలని ఆయన సూచించారు. గత వైసీపీ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేశారని, కూటమి ఏడాది పాలన ప్రగతిబాటలో సాగుతుందన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీమేరకు కూటమి ప్రభుత్వం ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించనున్నదన్నారు.

కార్యక్రమంలో జిల్లా జీడీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ తాగునీరు, సీసీ రోడ్లు, వీధి లైట్లు తదితర సమస్యలను గత ప్రభుత్వంలో పట్టించుకోలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ పనులు చేయటం జరిగిందన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పెమ్మసాని నాగేశ్వరరావు, గోవిందునాయక్, షేక్ ఖాశిం, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

10న బడి పండుగ

- స్కూల్స్‌లో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు
- 3.04లక్షల మంది తల్లిదండ్రుల భాగస్వామ్యం
- కలెక్టర్ పి.అరుణ్ బాబు



కలెక్టర్ అరుణ్‌బాబు


నరసరావు పేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో 10న పండగ వాతావరణంలో మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు నిర్వహించనున్నామని కలెక్టర్ పి.అరుణ్ బాబు శనివారం తెలిపారు. 3.04లక్షల మంది తల్లిదండ్రులు భాగస్వాములు కానున్నారు. గతంలో కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమే పరిమితమైన పీటీఎంలో ఈ విద్యా సంవత్సరంలో ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలలను సైతం భాగస్వామ్యం చేస్తున్నామన్నారు. మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేల నుంచి వార్డు మెంబరు దాకా ప్రజా ప్రతినిధులు, జిల్లా కలెక్టర్ నుంచి అన్ని స్థాయిల ప్రభుత్వ అధికారులు ఏదో ఒక పాఠశాల నుంచి పీటీఎం 2.0 కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. విద్యార్థులే స్వయంగా తయారుచేసిన ఆహ్వాన పత్రికల ద్వారా తల్లిదండ్రులను, పూర్వ విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సహా అందరు ఆహ్వానితులను ఆహ్వానించనున్నారు.

పీటీఎంను విజయవంతం చేయండి

పీటీఎం 2.0 ను విజయవంతం చేయడానికి కళాశాలల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. పేరెంట్స్ టీచర్స్ సమావేశం నిర్వహణపై విధివిధానాలను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణ కోసం కళాశాల కంపోజిట్ గ్రాంట్, మెగా పీటీఎం కోసం విడుదలచేసిన బడ్జెట్ ను వినియోగించాలన్నారు. ఈ సమావేశంలో 3.04లక్షల మంది తల్లిదండ్రులు భాగస్వామ్యం కానున్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమన్వయంతో పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం 'మెగా పీటీఎం 2.0' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాణ్యమైన విద్య, పథకాల అమలులో పారదర్శకత, అభివృద్ధి పనుల వేగవంతం లక్ష్యంగా ఈ సమావేశాలు నిర్వహిస్తున్నారు. 10న ఉదయం 9 నుంచి 1 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో మధ్యాహ్న భోజనం, విద్యామిత్ర కిట్లు, విద్యార్థుల హాజరు, అభ్యసన సామర్థ్యాలపై చర్చించి, వారి ప్రగతి పత్రాలను తల్లిదండ్రులకు అందజేయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు విద్యాపరంగా, ప్రవర్తనాపరంగా ఏ స్థాయిలో ఉన్నారో సమాజ అంశాలపై ఎలాంటి అవగాహన కలిగి ఉన్నారో తెలుసుకోవడంతోపాటు, అర్థంచేసుకోవడానికి కార్యక్రమం ఉపయోగపడుతుంది. జిల్లాలో మొత్తం పాఠశాలలు 2038, కళాశాలలు 91 ఉన్నాయని వివరించారు.

గ్రీన్ పాస్‌పోర్ట్

ఏక్ పేడ్ మాకే నామ్ అమ్మ పేరుతో ఒక మొక్కను ప్రతి విద్యార్థికి అందించడం జరుగుతుంది. నాలుగు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ వారు నమోదు చేసుకున్న సంఖ్య ఆధారంగా కనీసం ఒకటి నుంచి రెండు మొక్కలు అందించడం జరుగుతుంది. కార్యక్రమంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగం, భాగస్వాములై విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ జీవీ, పక్కన కొమ్మాలపాటి తదితరులు

కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం

● చీఫ్‌విప్ జీవీ

వినుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం ఉంటుందని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించిన తెలుగుదేశం పార్టీ సంస్థాగత ఎన్నికల సమావేశంలో జీవీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త నిబద్ధతతో ముందుకు సాగాలన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే, పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ మాట్లాడుతూ లభించిన పదవిని గౌరవంగా స్వీకరించి పార్టీని బలపరచేవిధంగా నిస్వార్థం పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, నియోజకవర్గ పరిశీలకులు మానుకొండ శివప్రసాదరావు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో రక్తదాన శిబిరం

శావల్యాపురం, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశాల మేరకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో మండల పరిషత్ కార్యాలయంలో రక్తదాన శిబిరాన్ని శనివారం నిర్వహించారు. రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖల నుంచి ఉద్యోగులు 8మంది శిబిరానికి హాజరై రక్తదానం చేశారు.

విద్యామిత్ర కిట్లు పంపిణీ

తుమ్మలకుంట (శావల్యాపురం) జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తలూరు పంచాయతీ పరిధిలోని తుమ్మలకుంటలో హెచ్ఎం బిళ్ళా రాజారమేష్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యామిత్ర కిట్లును శనివారం విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎస్ఎంసీ చైర్మన్ సిద్దెల మోషే, వైస్ చైర్మన్ రూతు పాల్గొన్నారు.

మండలంలో సహకార దినోత్సవం

రొంపిచర్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం, సంతగుడిపాడు, సుబ్బయ్యపాలెం, బుచ్చిపాపన్నపాలెం గ్రామాల్లోని సొసైటీ కార్యాలయాల్లో అంతర్జాతీయ సహకార దినోత్సవ వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయా సొసైటీల పర్సన్ ఇన్‌చార్జ్‌లు సహకార పతాకాలను ఎగురవేశారు.

విట్నెస్ అధికారి నియామక ఉత్తర్వులు రద్దు చేయాలి: యూటీఎఫ్

నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులతో జరిగే మెగా పీటీఎంలలో విట్నెస్ అధికారిని పాఠశాల హెడ్మాస్టర్ నియమించుకొని వారి చేత వీడియోలు అప్‌లోడ్ చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు తక్షణమే రద్దు చేయాలని యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కే శ్రీనివాసరెడ్డి, ప్రధానకార్యదర్శి ఎం మోహనరావు శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాభివృద్ధి మీద పాఠశాలలో ఉన్న మౌలిక వసతుల మీద మాట్లాడుకోవడాని 17రకాల కమిటీలు, ఫొటోలు, అప్‌లోడ్‌లు, విట్నెస్ అధికారి ఇంత తతంగం అవసరమా? అని ప్రశ్నించారు.

సేవ చేయడమే లక్ష్యం: చీఫ్‌విప్ జీవీ

వినుకొండ టౌన్, జూలై 5, (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ఎన్డీఏ ప్రభుత్వం లక్ష్యమని, అందుకు ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన స్వర్ణ ఆంధ్ర 2047 విజన్ సమావేశానికి జీవీ ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ అన్ని రంగాల్లో ఆంధ్ర ప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే సీఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన స్వర్ణ ఆంధ్ర ప్రదేశ్ 2047 విజన్ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో శివశక్తి లీలా ఫౌండేషన్ చైర్మన్ లీలావతి, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, మండల ప్రత్యేక అధికారి శ్రీరాములు, ఎంపీడీవో పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈశ్వర్ ఇంజనీరింగ్ విద్యార్థికి ఆటోమొబైల్ విభాగంలో గోల్డ్‌మెడల్

నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఈశ్వర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థి ఈర్ల ఉషశ్రీకి ఆటోమొబైల్ ఇంజనీరింగ్ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారని ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నాగమల్లేశ్వరరావు శనివారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూ 11వ స్నాతకోత్సవంలో మెడల్ ఈర్ల ఉషశ్రీ అందజేశారు. 2015, 2017, 2019, 2022, 2024, 2025 సంవత్సరాలలో మొత్తం ఆరుసార్లు ఈశ్వర్ కళాశాలకు గోల్డ్‌మెడల్ లభించిందని ప్రిన్సిపాల్ అన్నారు. ఈర్ల ఉషశ్రీకి కళాశాల చైర్మన్ షేక్ మీరావలి రూ.10 వేలు పారితోషికం అందజేసి ప్రత్యేకంగా అభినందించారు.

ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ విద్యార్థికి సైబర్ సెక్యూరిటీలో...

నరసరావుపేట టౌన్, జూలై 5 (ఆంధ్రజ్యోతి): ఏఎంరెడ్డి ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన ఎస్.అజీజ్‌కు సైబర్ సెక్యూరిటీలో గోల్డ్‌మెడల్ సాధించారని కళాశాల కార్యదర్శి అట్లూరి శాంతి శ్రీనివాసరెడ్డి శనివారం తెలిపారు. కాకినాడ జేఎన్‌టీయూలో ఈ నెల 4న జరిగిన కాన్వకేషన్‌లో గోల్డ్‌మెడల్ ప్రదానం చేశారన్నారు. ఈ సందర్భంగా అట్లూరి శాంతి గోల్డ్‌మెడల్ సాధించిన ఎస్.అజీజ్‌ను అభినందించారు.



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ బి రవి

లింగ నిర్ధారణ వెల్లడించడం నేరం

డీఎంహెచ్‌వో రవి

నర్సరావుపేట లీగల్, జూలై 5, (ఆంధ్రజ్యోతి): స్కాన్ సెంటర్లలో గర్భవతులను పరీక్షించి లింగ నిర్ధారణ సమాచారాన్ని గర్భిణి బంధువులకు, తెలియజేయడం చట్టరీత్యా నేరమని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ బి.రవి శనివారం తెలిపారు. పట్టణంలోని డీఎంహెచ్‌వో చాంబర్‌లో జిల్లాస్థాయి మెడికల్ టెర్మినేషన్ ప్రెగ్నెన్సీ చట్టం అమలుపై కమిటీ సభ్యులతో డీఎంహెచ్‌వో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏరియా వైద్యశాల, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య చాలా తక్కువగా ఉందన్నారు. జిల్లాలో ఇనిస్టిట్యూషనల్ డెలివరీ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల గైనకాలజీ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్ డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ లక్ష్మణరావు పిల్లల వైద్యులు డాక్టర్ గిరిరాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా విద్యుత్ నిలిపివేత

నాదెండ్ల, జూలై 5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సరఫరా నిలిపి వేయాలంటే ఆయా గ్రామాల ప్రజలకు ముందస్తు సమాచారం ఇవ్వాలి. ఐతే అలాంటి సమాచారం లేకుండానే ఆరు గ్రామాలకు శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేశారు. సుమారు మూడున్నర గంటల పాటు ఆయా గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపి వేయటంతో ప్రజలు తీవ్ర మైన అసౌకర్యానికి గురయ్యారు. నాదెండ్ల - తిమ్మాపురం మార్గం పక్కనే డెయిరీ ఫాంకు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు 11కేవీ లైన్ ఏర్పాటు చేసేందుకు నాదెండ్ల సబ్ స్టేషన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఆ సబ్ స్టేషన్ పరిధిలో నాదెండ్ల, తూబాడు, గొరిజవోలు, సంక్రాంతిపాడు, జంగాలపల్లి, చిరుమామిళ్ల గ్రామాలు ఉన్నాయి. ఉదయం 9:40 గంటల నుంచి మధ్యాహ్నం 1:05 గంటలకు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో ఆయా గ్రామాల్లోని వారు ఇబ్బందులు పడ్డారు.



తిరుమల ఆగ్రో అండ్ కాటన్ ప్రొడక్ట్స్ ప్లాంటు ఆవరణలోని ఫైర్ ఎక్విప్‌మెంట్‌ను పరిశీలిస్తున్న డీఎస్‌వో ఎంవీ ప్రసాద్

తిరుమల ఆగ్రో ప్రొడక్ట్సులో డీఎస్‌వో తనిఖీ

యడ్లపాడు, జూలై 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపురం పరిధిలోని ఆగ్రో అండ్ కాటన్ ప్రొడక్ట్స్ ఫ్యాక్టరీని జిల్లా పౌరసరఫరాల అధికారి ఎంవీ ప్రసాద్ శనివారం సందర్శించారు. ఫ్యాక్టరీలోని సాల్వెంట్ ప్లాంటును, అందులోని యంత్రాలను, పరిసరాలను, ఫైర్ సేఫ్టీ పరికరాలను ఆయన తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ సాల్వెంట్ ప్లాంటు నిర్వహణకు సంబంధించి రెన్యూవల్ లైసెన్స్‌కోసం యాజమాన్యం ఇటీవల దరఖాస్తు చేసుకుందన్నారు. ఈ నేపథ్యంలో ప్లాంటులోని పరిస్థితులను, భద్రతా విషయాలను పరిశీలించేందుకు వచ్చినట్లు వివరించారు. ఆయన వెంట ఇన్‌చార్జి సీఎస్ డీటీ అనూరాధ, సిబ్బంది ఉన్నారు.

గ్రానైట్ ఫ్యాక్టరీలో సామగ్రి దోపిడీ

చిలకలూరిపేట, జూలై 5 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట కోటప్పకొండ మార్గంలో పోతవరం సమీపంలో ఉన్న హేమసాయి గ్రానైట్ ఫ్యాక్టరీలో శనివారం తెల్లవారుజామున దోపిడీ జరిగింది. ప్రస్తుతం ఆ ఫాక్టరీ మూతపడి ఉంది. అందిన సమాచారం ప్రకారం ఆటోలో వచ్చిన 10మంది దుండగులు ఇద్దరు ఫాక్టరీ వాచ్‌మెన్లను దారుణంగాకొట్టి గాయపరిచారు. అనంతరం ఫాక్టరీ కేబుళ్లను, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లోని ఆయిల్‌ను, కాపర్ వైరును తీసుకుని వెళ్లారు. దోపిడీచేసిన సామగ్రి విలువ సుమారు రూ.2.5లక్షలు ఉంటుందని అంచనా. తీవ్రంగా గాయపడిన వాచ్‌మెన్లు స్థానిక ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇందుకు సంబంధించి చిలకలూరిపేట రూరల్ పోలీసులకు ఫ్యాక్టరీ వారు ఫిర్యాదు చేశారు.



లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి మహాలక్ష్మి కల్యాణ మహోత్సవం

వినుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): కొండమెట్ల వద్ద ఉన్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి అతి పురాతన దేవస్థానంలో తొలి ఏకాదశి పండుగ కార్యక్రమాల్లో భాగంగా మొదటి రోజు శ్రీలక్ష్మీనరసింహస్వామి, మహాలక్ష్మి అమ్మవారి కల్యాణ మహోత్సవ కార్యక్రమంలో మహిళా భక్తులు పాల్గొని ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నెల్లూరు జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మాలకొండ శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఆయన సతీమణి శివశక్తి లీలా ఫౌండేషన్ చైర్మన్ గోనుగుంట్ల లీలావతి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జీవీ దంపతులను ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.



కొత్త యూనిఫాం వేసుకున్న కార్మికులతో మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోస్

పారిశుధ్య కార్మికులకు ప్రత్యేక యూనిఫాం పంపిణీ

వినుకొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతి): వైభవోపేతంగా జరగనున్న తొలి ఏకాదశి పండుగను పురస్కరించుకొని కొండపై పారిశుధ్య పనులు చేపడుతున్న 200మంది మున్సిపల్ కార్మికులకు మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి ఆదేశాల మేరకు పురపాలక సంఘం లోగోతో టీషర్ట్ యూనిఫాంను హ్యాండ్ గ్లౌజ్‌లు శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుభాషచంద్రబోస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇస్మాయిల్ సిబ్బంది పాల్గొన్నారు.